వృథాగా రక్షిత మంచినీటి పథకం

- నిరుపయోగంగా ఫిల్టర్ బెడ్‌లు..
- రూ.2.50 కోట్ల ప్రజాధనం వృథా
- మరమ్మతులు చేస్తే మండలవాసులకు తీరనున్న తాగునీటి సమస్య



నిరుపయోగంగా సంపులు



వృథాగా ఉన్న ఫిల్టర్ బెడ్‌లు

సారంగాపూర్: ప్రభుత్వం మిషన్‌భగీరథతో గ్రామాల్లో శుద్ధజలం అందించాలనే లక్ష్యం ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. చాలా చోట్ల పైప్‌లైన్లు పగిలి మరమ్మతులకు రావడం, మెట్‌పల్లి డబ్బా ప్రాంతం నుంచి వచ్చే నీటికి సాంకేతిక సమస్యలతో అప్పుడప్పుడు ఆవాంతరాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మొన్నటివరకు ఎండల తీవ్రతతో మండలంలో భూగర్భజలాలు అడుగంటాయి. మిషన్ భగీరథ నీటిసరఫరాలో ఏర్పడ్డ సాంకేతిక లోపంతో మే,జూన్ నెలల్లో ప్రజలు ఇబ్బందిపడ్డారు. దీంతో పాటు మండలంలోని నర్సింహులపల్లె గ్రామానికి ఇప్పటి వరకు మిషన్‌భగీరథ ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించని అధికారులు

బీర్‌పూర్ మండల శివారుల్లో అప్పటి ప్రభుత్వం రూ. 2.50 కోట్లు వెచ్చించి భారీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసింది. ఇందుకు భారీ సంపులు, ట్యాంక్‌లు, ఫిల్టర్‌బెడ్‌లు, పంపు హౌజ్‌లు ఏర్పాటు చేసి బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్ గ్రామాలతో పాటు ధర్మపురి మండలంలోని ఆరు గ్రామాలకు తాగునీరు అందించింది. ఇక్కడి నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉందని 4 ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేసింది. ఇసుకలో ఫిల్టర్ అయిన తరువాత తాగునీరు నేరుగా సంపుల నుంచి ట్యాంకులకు చేరేవిధంగా ఏర్పాటు చేశారు. రోల్లవాగు ప్రాజెక్టు వద్ద 100 హెచ్‌పీ సామర్థ్యంగల మోటార్లను ఏర్పాటు చేసి, నీటిని రక్షిత మంచినీటి సంపులకు మళ్లించారు. నీరు పూర్తిగా ఫిల్టర్ అయిన తరువాత గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంక్‌ల నుంచి తాగునీటిని సరఫరా చేశారు.

మూలన పడిన పథకం

ప్రభుత్వం మిషన్‌భగీరథతో అన్ని గ్రామాల్లో ఇంట్రాలైన్లు, ట్యాంకులను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తోంది. అయినప్పటికీ సాంకేతిక కారణాలతో అప్పుడప్పుడు నీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పునరుద్ధరిస్తే లాభం..

మిషన్‌భగీరథ పథకం రావడంతో బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పనిచేయకుండా పోయింది. ఫలితంగా చాలా చోట్ల పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. రోల్లవాగు ప్రాజెక్టు ఆధునీకరించే సమయంలో పైప్‌లైన్లు, విద్యుత్తు లైన్లు, మోటార్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. రోల్లవాగు ప్రాజెక్టు వద్ద పైప్‌లైన్లను, విద్యుత్ లైన్లు, కొత్తగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి, ఫిల్టర్ బెడ్‌లలోని ఇసుకను మార్చి, మిషన్‌భగీరథ పైప్‌లైన్లతో అనుసంధానం చేస్తే మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్‌భగీరథ నీరు అందనప్పుడు ఈ శుద్ధజలాన్ని నిరంతరాయంగా అందించవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రక్షితమంచినీటి పథకానికి మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పునరుద్ధరణకు తీర్మానం చేస్తాం



బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరించి, మిషన్‌భగీరథ నీరు అందని సమయంలో తాగునీటిని అందించొచ్చు. దీనికి తగిన విధంగా నిధులు విడుదల చేస్తే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండవు. ఈ విషయంపై రానున్న సర్వసభ్య సమావేశంలో పథకం పునరుద్ధరణకు తీర్మానం చేస్తాం.

– మసర్తి రమేశ్,ఎంపీపీ, బీర్‌పూర్

గుట్టలు తవ్వేస్తున్నారు..

- కోట్లు కొల్లగొడుతున్న మట్టి మాఫియా
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- కనుమరుగవుతున్న ప్రకృతి సంపద



మట్టిని తవ్వుతున్న జేసీబీ, ట్రాక్టర్లు

వెల్గటూర్: ఎండపల్లి మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. మట్టి అక్రమ రవాణాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికార పార్టీ పెద్దల అండదండలతో, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నారు. కాపాడాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. ఎండపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పట్టపగలు జేసీబీ, ట్రాక్టర్లతో గుట్టలు తవ్వేసి మట్టిని తరలిస్తున్నారు. ప్రతినిత్యం వందలాది ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. నిత్యం లక్షల్లో వ్యాపారం సాగిస్తూ ఏడాది పొడుగునా కాసులు దండుకుంటున్నారు. బుధవారం పట్టపగలే ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారని ఎండపల్లి తహసీల్దార్ ఉదయ్ కుమార్ ఆర్ఐ కరుణాకర్‌లకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మట్టి మాఫియాకు అధికారులు, నాయకుల అండదండలున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు యథేచ్ఛగా మట్టి తరలిస్తూ ప్రకృతి సంపద కనుమరుగవుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలు ఆపేశాం

మట్టి తీయడానికి జేసీబీ,ట్రాక్టర్లు వచ్చినట్లు ఫిర్యాదు అందగానే వెళ్లి వాహనాలు ఆపివేశాము. జేసీబీ, ట్రాక్టర్లు వచ్చినా మట్టి తీయలేదు కాబట్టి వాహనాలు సీజ్ చేయడం కానీ, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

– ఉదయ్ కుమార్, తహసీల్దార్, ఎండపల్లి

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

బుగ్గారం: ఆయిల్ పామ్ తోటలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని డివిజనల్ వ్యవసాయాధికారి రాంచంద్రం తెలిపారు. మండలంలోని మద్దునూర్‌లో రైతు ఏనుగు ఆదిరెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ రైతులు వరి పంటలపైనే ఆధార పడకుండా అందుకు ప్రత్యామ్నాయంగా ఉండే ఆయిల్‌పామ్ తోటలను పెంచుకోవాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. ఒక్కో మొక్కను సబ్సిడీ కింద 20 రూ.లకే అందిస్తున్నామని, ఎకరం స్థలంలో 50 నుండి 60 మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. తోటలు పెంచే రైతులకు అన్ని ఖర్చులు పడకుండా ప్రభుత్వమే అందిస్తుందని, అదే విధంగా 90 శాతం సబ్సిడీ కింద డ్రిప్ పరికరాలను కూడా అందిస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు శ్రీనివాస్, అక్షయ్‌కుమార్, ఎంపీటీసీ మహేశ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మల్లాపూర్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని ఏవో లావణ్య అన్నారు. బుధవారం రాఘవపేటలో ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, యాజమన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నత్తి లావణ్య, ఉపసర్పంచ్ ఎండీ.అమిన్, ఏఈవో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ సుజాత ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 53 పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వెంకటేశం, మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్, పీఆర్ ఏఈఈ ఇబ్రహీం, ఆర్ఐ తిరుపతి బుధవారం వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అవసరమైన మేరకు ర్యాంపులు, వెంటిలేషన్, విద్యుత్ సరఫరా సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్ర పురస్కారాలు



ప్రశంసా పత్రాలతో ఆర్టీసీ సిబ్బంది

మెట్‌పల్లి: విధుల్లో ప్రతిభ చూపిన పలువురు ఆర్టీసీ సిబ్బందికి ఉన్నతాధికారులు ప్రగతి చక్ర పురస్కారాలు అందించారు. మెట్‌పల్లి డిపోకు చెందిన ప్రభాకర్, బలరాం, రవీందర్, శ్రీనివాస్‌లకు బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ పురస్కారాలు అందించారు. వీరిని డిపో మేనేజర్ వేదవతి పాటు సిబ్బంది అభినందించారు.

సైబర్ నేరాలపై తల్లిదండ్రులను చైతన్య పరచాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులను చైతన్య పరచాలని ఎస్సై ఉమాసాగర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సెల్‌ఫోన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దని, ఆన్‌లైన్ రుణాలను తీసుకొవద్దని తెలిపారు. తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొవద్దని వాటిని మనం అనుమతించవద్దని వివరించారు. డీపీలకు వ్యక్తిగత ఫోటోలు పెట్టవద్దని తెలిపారు. సైబర్‌నేరాలపై జరిగే మోసాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, గుమ్లాపూర్, మాదాపూర్ గ్రామాలను జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు డీఎల్‌పీవో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, హరితహారం, పల్లె ప్రకృతి వనం, కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణం పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు సరికెల్ల మల్లారెడ్డి, యాదగిరి అమ్మాయి, నూతిపెల్లి గంగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

18 నుంచి మినీ గురుకుల ఉద్యోగుల సమ్మె

రాయికల్: మినీగురుకులం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు కవిత, లక్ష్మి బుధవారం తెలిపారు. ధర్నాలో మినీ గురుకుల ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలు పాలుపంచుకోవాలి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పూజల్లో ఎమ్మెల్యే దంపతులు, జెడ్పీ చైర్‌పర్సన్

మెట్‌పల్లి: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలు పాలుపంచుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన జ్ఞాన యజ్ఞం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా శృంగేరి శారదాపీఠం అస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రీ భక్తులకు భగవద్గీత సారాంశం గురించి వివరించారు. ప్రత్యేక పూజలతో పాటు గోపాల కృష్ణుని కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు తదితరులున్నారు.

ఆసుపత్రి ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని కల్లూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్యా పిల్లల ఆస్పత్రిని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నరేంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంతం రాజం, కౌన్సిలర్లు, పార్టీల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను చాటే విధంగా చైతన్యం రావాలి



పూజలు చేస్తున్న సంతోష్‌కుమార శాస్త్రి, ఎమ్మెల్యే

మల్లాపూర్: ధర్మాన్ని సంరక్షిస్తూ, చరిత్రను తెలుసుకుంటూ సంస్కృతీ సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను చాటే విధంగా ప్రజల్లో చైతన్యం రావాలని శృంగేరీ పీఠం ఆస్థాన పౌరాణికులు శ్రీ బాచంపల్లి సంతోష్‌కుమార శాస్త్రి అన్నారు. రాఘవపేటలో బుధవారంవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని బీఆర్‌ఎస్ ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రపంచంలో ప్రజలంతా ఒక్కటేనని, సమాజమే భగవంతుడి ఆలయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లావణ్య, ఉపసర్పంచ్ ఎండీ.అమీన్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'కొండగట్టు'



బహుమతులు అందిస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: పట్టణంలో పన్నాల తిరుపతిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతగా మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు జట్టు నిల్వగా, రన్నర్‌గా రాయికల్ మండలం భూపతిపూర్ జట్లు నిలిచాయి. వీరికి రూ.20 వేల నగదుతో పాటు, ట్రోఫీని స్పాన్సర్ పన్నాల తిరుపతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల బీజేపీ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళారపు సత్యనారాయణ, ఎంపీటీసీ ఆకుల మహేశ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సాయిరాజ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



గోరింటాకుతో రాయికల్ కిట్టిపార్టీ మహిళలు

రాయికల్: పట్టణంలో ఆషాఢమాసం సందర్భంగా బుధవారం మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గోరింటాకు పెట్టుకుని పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కిట్టిపార్టీ సభ్యులు మచ్చ లలిత, కౌన్సిలర్ మ్యాకల అనురాధ, తాటిపాముల భాగ్యలక్ష్మీ, రమ్య, అనూష, సౌజన్య, వాసం పద్మ, బోగ లలిత, దాసరి రజిత, సుజాత పాల్గొన్నారు.

జగిత్యాల: ఆషాఢమాసం పురస్కరించుకుని స్థానిక రవీంద్ర ప్లేస్కూల్‌లో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రజిత మాట్లాడుతూ, గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలోని అనారోగ్య సమస్యలు, ఇన్ఫెక్షన్లు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిహారిక, మౌనిక, అజిత పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని నక్కలపేట ఎస్.ఎస్ మోడల్ స్కూల్‌లో బుధవారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థినులు, టీచర్లు గోరింటాకు వేడుకల్లో పాల్గొన్నారు.

మల్యాల:మండలంలోని లాస్య పాఠశాలలో గురువారం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. గోరింటాకును రోలులో వేసి, సంప్రదాయబద్ధంగా దంచి, పాఠశాలలోని విద్యార్థులందరికీ పెట్టారు. ఉపాధ్యాయులు సైతం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంసుష్మ, కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూటపల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయికల్: మండలంలోని మూటపల్లిలో మల్లాపూర్ మండలం వీవీరావుపేట గ్రామ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కృష్ణవేణి 134 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద మందులతో కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెక్కం తిరుపతి, నాయకులు దేవారెడ్డి, ఫార్మాసిస్ట్ జ్యోతి పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి

మల్యాల: మండల కేంద్రంలో అదనపు లోడుతో విద్యుత్ మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గురువారం రైతులు విద్యుత్ ఏఈ కొమ్ము కమలేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి మోటార్లు ఉండడంతో చివరన ఉన్న వ్యవసాయ బావుల మోటార్లు ఓవర్ లోడుతో తరచూ కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు కోరగా, ఏఈ కమలేశ్వర్ సానుకూలంగా స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంగ నారాయణ, సత్యనారాయణ, సంగ శ్రీనివాస్, దేవేందర్, నక్క పర్శరాం ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

ఇబ్రహీంపట్నం: జిల్లా కేంద్రంలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఓరుగంటి నితిన్, రెడ్డవేన సామిత్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం గద్దం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ. 7500 నగదుతో పాటు ప్రశంసా పత్రాలను ఆర్‌బీఐ లైజనింగ్ అధికారి శ్రీకుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జగిత్యాల మండల విద్యాధికారి గాయత్రి అందించారు. ఈ సందర్భంగా ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

కోరుట్లటౌన్: జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్ మాదిగ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయ కేంద్రంలో జిల్లా కో-కన్వీనర్ బలవంతుల సురేశ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రతి గ్రామంలో జెండా ఎగురవేయాలని సురుగు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో కోరుట్ల మండల కన్వీనర్ బంగారి ప్రమోద్, కో-కన్వీనర్ కుంటాల శ్రీనివాస్, చిట్యాల కార్తీక్, బొల్లె రమేశ్, గంగారాం, కిరణ్, నవీన్, మోహన్, మదన్, గంగాధర్, వెంకట్ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 6 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పులి మల్లేశం తెలిపారు. సమ్మె పోస్టర్‌ను బుధవారం జగిత్యాల మినీస్టేడియంలో సీఐటీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన మాట్లాడుతూ గురువారం నుంచి ప్రారంభమయ్యే పంచాయతీ కార్మికుల సమ్మె వారి ఉద్యోగాలను పర్మనెంట్ చేసేవరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజలింగం, సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, నాయకులు ఉన్నారు.

ఆత్మీయ సన్మానం

కోరుట్లటౌన్: పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కోరుట్ల సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజుకు బుధవారం ఆత్మీయ సన్మానం జరిగింది. నాగరాజు ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందాడు. ఈ క్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, సభ్యులు నాగరాజుకు ఆత్మీయ సన్మానం చేశారు.కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గుర్రాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లిఖార్జున్, కోశాధికారి వెలువాయి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ బోనాలు

మెట్‌పల్లి: పట్టణంలో గంగపుత్రులు బుధవారం మహాలక్ష్మీ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఇంటికో బోనం, వలలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం పూజలు జరిపి బోనాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కౌన్సిలర్ మర్రి పోచయ్య, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీటితో రైతుల్లో హర్షం

జగిత్యాలరూరల్: వర్షాలు లేకున్నా కాళేశ్వరం నీరు పంప్‌హౌస్ ద్వారా అందడంతో పంటలు సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన రైతు రాజం బుధవారం కాళేశ్వరం ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌తో రాంపూర్ పంప్‌హౌస్‌కు నీరు చేరుకోగా ఆ నీరును అంతర్గాం ఊర చెరువుకు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నూతన నియామకం

మల్లాపూర్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండంపల్లికి చెందిన దనరేకుల సంతోష్ యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేశ్ యాదవ్ తెలిపారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో సంతోష్‌యాదవ్‌కి ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముకేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేష్‌యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి లక్కం మల్లేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు సంగ గంగరాజం, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు

మల్లాపూర్ : నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్, రాఘవపేట, హుస్సేన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, గైడ్లు, ఇతరసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు హెచ్‌ఎంలు,, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బ్రహ్మగర్జన విజయవంతం చేయాలి

జగిత్యాల: ఈ నెల 9న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బ్రహ్మగర్జనను విజయవంతం చేయాలని జగిత్యాల బ్రాహ్మణ సేవ సంఘం సభ్యులు కోరారు. బుధవారం బ్రాహ్మణ సేవా భవనంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తీగుళ్ల సూర్యనారాయణశర్మ, అనంతచార్యులు, ఉమాకాంత్‌శర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మండలంలోని పోతారం, మల్యాల సబ్‌స్టేషన్ల పరిధిలోని పోతారం, రాజారం, మల్యాల, నూకపల్లి, గుడిపేట, ముత్యంపేట గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫౌంటేన్ కాదు.. మిషన్ భగీరథ లీకేజీ!



ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ వద్ద మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ పగిలి స్వచ్ఛమైన తాగునీరు వృథాగా పోతోంది. మిషన్ భగీరథ అధికారులు పగిలిన పైప్‌ను వెంటనే మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగు నీరు వృథా కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. గోధూర్ వద్ద మెయిన్‌పైప్ పగలడంతో మండలంలోని గ్రామాలకు నీటి సరాఫరా నిలిచిపోయింది.